క్లుప్తంగా

పిడకలతో భోగి మంటలు వేయండి



బ్యానర్ ఆవిష్కరిస్తున్న గో ఆదారిత ప్రకృతి వ్యవసాయం సంఘం ప్రతినిధులు

మద్దిలపాలెం : ఆవు పేడతో తయారు చేసిన పిడకలతో సంప్రదాయబద్ధంగా భోగి మంటలు వేసుకుని మన సంస్కృతిని, పర్యావరణని కాపాడుకుందామని గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం విశాఖ జిల్లా అధ్యక్షుడు దాట్ల సుబ్రహ్మణ్యంవర్మ పిలుపునిచ్చారు. ఈ మేరకు శివాజీపాలెంలోని సంఘం కార్యాలయంలో బ్యానర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వర్మ మాట్లాడుతూ పిడకలను తయారు విధానాన్ని సూచనలు చేశారు. ప్లాస్టిక్ వ్యర్థాలు, టైర్లతో భోగి మంటలు వేయవద్దని కోరారు. వ్యవసాయ శాస్త్రవేత్త అశోక్‌కుమార్, సంఘం కార్యదర్శి పాలెం నేచురల్స్ చవ్వాకుల అశోక్, ప్రతినిధులు మురళీధర్, సలాది కృష్ణయ్య, గ్రీన్ క్లైమెట్ టీం వ్యవస్థాపక కార్యదర్శి జె.వి.రత్నం, తదితరులు పాల్గొన్నారు.

సాంబశివరావుకు ఏయూ డాక్టరేట్

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం జర్నలిజం విభాగ పరిశోధక విద్యార్థి, ఆలిండియా రేడియో ఉద్యోగి కె.సాంబశివరావుకు వర్సిటీ డాక్టరేట్ లభించింది. జర్నలిజం విభాగ ఆచార్యుడు చల్లా రామకృష్ణ పర్యవేక్షణలో పాపులర్ తెలుగు రేడియో డ్రామాస్–ఏన్ ఎనలిటికల్ స్టడీ‘ అంశంపై జరిపిన పరిశోధనకు డాక్టరేట్ వచ్చింది. ఈ సందర్భంగా ఏయూ ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె.సమత నుంచి ఆయన డాక్టరేట్ ఉత్తర్వులు స్వీకరించారు.

అర్హతే ప్రామాణికం

నాడు టీడీపీ పాలనలో..

- పింఛన్ అర్హత వయసు 65 ఏళ్లు.
- కొత్త పెన్షన్ పొందాలంటే క్లస్టర్‌లో ఎవరైనా చనిపోవాలి.
- జన్మభూమి కమిటీని ప్రసన్నం చేసుకోవాలి.
- పింఛన్‌గా అందజేసే సొమ్ము రూ.1,000.
- కొత్త పింఛన్లు ఎన్నికల ముందు మాత్రమే మంజూరు చేసేవారు.
- కార్యాలయాలు, అధికారుల చుట్టూ తిరగాల్సి వచ్చేది.

నేడు వైఎస్సార్‌సీపీ సుపరిపాలనలో..

- పింఛన్ అర్హత వయసు 60 ఏళ్లు
- అర్హత ఉంటే కొత్త పెన్షన్ ఎప్పుడైనా పొందవచ్చు.
- ఇంటి వద్ద నుంచే వలంటీర్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. ఇంటి వద్దే పెన్షన్ డబ్బులు అందుకోవచ్చు.
- అధికారులు, కార్యాలయాల చుట్టూ తిరగక్కర లేదు.
- పింఛన్‌గా అందజేసే సొమ్ము రూ.3 వేలు.





కేజీహెచ్‌కి వెళ్లి పింఛన్ అందిస్తున్న వలంటీర్(ఫైల్)

వార్డుల వారీగా పింఛన్ల వివరాలు

వార్డు	2023 నాటికి	నూతన పింఛన్లు	మొత్తం
14	776	4	780
15	1017	8	1025
16	1169	13	1182
17	984	14	998
18	1212	23	1235
19	1821	35	1856
20	762	12	774
21	694	2	701
22	1199	21	1220
23	1233	14	1247
24	1117	13	1130
25	1366	23	1389
26	1015	9	1024
27	1223	12	1235
మొత్తం	15,588	208	15,796

- జోన్–3లో కొత్తగా 208 మందికి పెన్షన్ల మంజూరు
- మొత్తంగా 15,796 మందికి వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ

బీచ్ రోడ్డు: కులం లేదు.. మతం లేదు.. పార్టీ లేదు.. అర్హత ఉంటే చాలు సంక్షేమ ఫలాలు అందిస్తామని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పిన మాటలకు నిదర్శనమే గడిచిన నాలుగేళ్లలో రెట్టింపు పింఛన్లు మంజూరు కావడం. అంతే కాకుండా ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు దశల వారీగా రూ.2వేలు నుంచి రూ.3 వేలకు పెంచి లబ్ధిదారుల కుటుంబాల్లో సంతోషాలు నింపారు. గతంలో ఎన్నడు లేని విధంగా ఒంటరి మహిళలు, కిడ్నీ రోగులు, ట్రాన్స్‌జెండర్లకు కూడా పింఛన్ మంజూరు చేసి సీఎం వైఎస్ జగన్ తన ఉదారతను చాటుకున్నారు.

రెట్టింపు అయిన లబ్ధిదారులు

జీవీఎంసీ జోన్–3 పరిధిలో సామాజిక పింఛన్ లబ్ధిదారుల సంఖ్య 2019తో పోల్చుకుంటే ప్రస్తుతం రెట్టింపు అయింది. 2019లో 7,428 మంది పింఛన్లు పొందితే.. ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 15,588 మంది లబ్ధిపొందుతున్నారు. ఈ ఏడాది నూతనంగా మరో 208 మందికి పింఛన్ మంజూరు కావడంతో మొత్తంగా లబ్ధిదారుల సంఖ్య 15,796 మంది చేరింది.

వలంటీర్‌తో ఇంటికే పింఛన్

2019 వరకు సామాజిక పింఛన్ పొందాలంటే లబ్ధిదారులకు చాలా కష్టంగా ఉండేది. మీ సేవ కేంద్రాలు, వార్డు కార్యాలయాల వద్ద గంటల తరబడి పడిగాపులు కాస్తే కొంత మందికి మాత్రమే ఆ రోజు డబ్బులు అందేవి. మిగతా వారిని మళ్లీ మరుసటి రోజు రావాలని చెప్పి పంపించే వారు. కానీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత వలంటీర్ వ్యవస్థ ద్వారా ఇంటి వద్దకే ఒకటో తేదీన ఉదయాన్నే లబ్ధిదారులకు పింఛన్ అందుతోంది. దీంతో వృద్ధులు ఇంటి నుంచి కదలకుండానే పింఛన్ సొమ్ము అందుకుని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

క్యూలో ఉండాల్సిన అవసరం లేదు..



గతంలో పింఛన్ తీసుకోవాలంటే గంటల తరబడి క్యూలో ఉండాల్సి వచ్చేది. అయినా సరే ఆ రోజు డబ్బు వస్తుంది అనే నమ్మకం ఉండేది కాదు. కానీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ల ద్వారా ఇంటికే అది కూడా ఒకటో తేదీనే పింఛన్ పంపిస్తున్నారు. ప్రతి నెలా ఇంటి వద్దనే పింఛన్ అందుకుంటున్నాను.

– కె.రామకృష్ణ, దివ్యాంగ పింఛన్‌దారుడు

రూ.3వేల పింఛన్‌తో ఆత్మగౌరవం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ ప్రకారం రూ.3 వేలు పింఛన్ చేయటంతో మాలో ఆత్మగౌరవం పెరిగింది. మందులు, సొంత అవసరాల కోసం ఇంట్లో ఎవరిని అడగాల్సిన పని లేకుండా మాకు వచ్చిన డబ్బులే సరిపోతున్నాయి. పింఛన్ కూడా ఒకటో తేదీన ఇంటికి పంపిస్తున్నారు. ఇచ్చిన మాట నిలబెట్టుకున్నా ఇటువంటి ముఖ్యమంత్రి ఈ రాష్ట్రానికి మళ్లీ రావాలి.

– టి.లక్ష్మి, వృద్ధాప్య పింఛన్ లబ్ధిదారురాలు

కృష్ణా కళాశాల అభివృద్ధికి ప్రత్యేక కృషి

- ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ
- ఘనంగా కళాశాల వార్షికోత్సవం



కృష్ణా కళాశాల వార్షికోత్సవంలో మాట్లాడుతున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ



విద్యార్థినుల నృత్య ప్రదర్శన

మద్దిలపాలెం : డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ అన్నారు. కళాశాల వార్షికోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా ఎంపీ మాట్లాడుతూ కళాశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు కేటాస్తానన్నారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలన్నారు. ఏపీఐఐసీ డైరెక్టర్ మొల్లి అప్పారావు మాట్లాడుతూ క్రమ శిక్షణతో విద్యలో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు మాట్లాడుతూ కళాశాల ప్రగతిని వివరించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సెలవుల్లో తెరిచిన పాఠశాలలపై చర్యలకు వినతి

ఆరిలోవ: సంక్రాతి సెలవుల్లో తెరిచిన ప్రైవేట్ పాఠశాలల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్(ఏబీవీపీ) సభ్యులు బుధవారం డీఈవో ఎల్.చంద్రకళకు వినతి పత్రం అందజేశారు. విద్యా శాఖాధికారులు సంక్రాతి సెలవుల ప్రకటించినప్పటికీ కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలు యథావిధిగా నిర్వహిస్తున్నారని, వారి పాఠశాలల గుర్తింపు రద్దు చేయాలని వినతి పత్రంలో డిమాండ్ చేశారు. అధికారుల ఆదేశాలు పాటించేటట్ల చర్యలు తీసుకోవాలని కోరారు. ఏబీవీపీ రాష్ట్ర కో కన్వీనర్ నితిన్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

- ఇదిలా ఉండగా బుధవారం కూడా ఆరిలోవ ప్రాంతంలో పలు ప్రైవేట్ పాఠశాలలు తెరిచి తరగతులు నిర్వహించారు. పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు విద్యా శాఖాధికారులకు ఫిర్యాదు చేయడంతో బుధవారం ఉదయం పలు పాఠశాలలకు చినగదిలి మండలంలోని ఇద్దరు ఎంఈవోలు ఫోన్ చేసి పాఠశాలలు నిర్వహించవద్దని హెచ్చరించారు. దీంతో అయా పాఠశాలలు మాత్రమే సెలవు ప్రకటించి మధ్యలోనే విద్యార్థులను విడిచిపెట్టారు. టీఐసీ పాయింట్, బాలాజీనగర్, పెదగదిలి, చినగదిలి, ఆదర్శనగర్‌లలో పాఠశాలలు మాత్రం యథావిధిగా కొనసాగాయి.

ఉత్సాహంగా గ్రాండ్ ఫెస్ట్ 2కే24



ఏఎస్ రాజా కళాశాల ఆవరణలో సంప్రదాయ దుస్తుల్లో విద్యార్థులు

ఆరిలోవ: ఎంవీపీ కాలనీ ఏఎస్ రాజా కళాశాలలో బుధవారం ది గ్రాండ్ ఫెస్ట్ 2కే24 ఉత్సాహంగా జరిగింది. కళాశాల క్రీడా మైదానంలో నిర్వహించిన ఈ ఫెస్ట్‌లో నగరంలోని పలు కళాశాలలకు చెందిన విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని సందడి చేశారు. ఈ వేడుకలను కళాశాల కరెస్పాండెంట్ విజయరాజేంద్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా సంస్కృతి, సంప్రదాయాల ప్రదర్శన, వంటలు, సంక్రాంతి ముగ్గులు తదితర అంశాలపై విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. ఇక్కడ ఏర్పాటు చేసిన 12 స్టాళ్లలో పలు రకాల ఉత్పత్తులు ప్రదర్శించారు. గంగిరెద్దుల ఆటలు, భోగి మంటలు, విద్యార్థుల సంప్రదాయ నృత్యాలు అలరించాయి. పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కాసు, అధ్యాపకులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహ పోస్టర్ ఆవిష్కరణ



అంబేడ్కర్ విగ్రహ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

ఆరిలోవ: రాష్ట్ర ప్రభుత్వం విజయవాడలో నిర్మించిన 125 అడుగుల రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమం ఈ నెల 19న జరగనుంది. ఈ మేరకు ముద్రించిన పోస్టర్‌ను బుధవారం జీవీఎంసీ 10వ వార్డు రవీంద్రనగర్‌లో ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకులతో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ అంబేడ్కర్ దేశంలో సామాజిక న్యాయం కోసం అలుపెరగని పోరాటం చేశారన్నారు. అలాంటి వ్యక్తికి మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రాధాన్యత ఇచ్చి 125 అడుగుల విగ్రహాన్ని ఏర్పాటు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఎస్సీ సెల్ నగర అధ్యక్షుడు బోని శివరామకృష్ణ, ఎస్సీ సెల్ జోనల్ ఇన్‌చార్జి అల్లంపల్లి రాజబాబు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

వెంకన్న ఆలయంలో ప్రత్యేక పూజలు



గోదాదేవికి ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు

మద్దిలపాలెం : ధనుర్మాస ఉత్సవాలలో భాగంగా ఎంఎంటీసీ కాలనీలోని త్రిమూర్తిక వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం నిరాటోత్సవం నిర్వహించారు. తెల్లవారు జాము నుంచి గోదాదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

నేటితో ముగియనున్న మార్గశిర మాసోత్సవాలు

డాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర కల్పవల్లి, ఆంధ్రుల ఆరాధ్య దైవం కనకమహాలక్ష్మి మార్గశిర మాసోత్సవాలు గురువారంతో ముగియనున్నాయి. ముగింపు ఉత్సవాల్లో భాగంగా టౌన్‌కొత్తరోడ్డు జగన్నాథస్వామి ఆలయం వద్ద 20 వేల మంది భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు. సాయంత్రం 4 గంటల నుంచి అమ్మవారికి సహస్ర ఘటాభిషేకం చేపట్టనున్నారు. ఈ సందర్భంగా సాయంత్రం 4 నుంచి రాత్రి 7 గంటల వరకు దర్శనాలు నిలిపివేయనున్నారు.

29వ రోజు పూజలు

మార్గశిర మాసోత్సవాలు సందర్భంగా బుధవారం 29వ రోజు అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ఉదయం 5 నుంచి 6 గంటల వరకు పంచామృతాభిషేకం, అమ్మవారికి సహస్రనామార్చన, 6 నుంచి 11 గంటల వరకు సర్వదర్శనం, 11.30 నుంచి 12 గంటల వరకు అమ్మవారికి పంచామృతాభిషేకం, మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సర్వదర్శనం, 6 నుంచి 7 గంటల వరకు విశేష పంచామృతాభిషేకం, అష్టోత్తర నామార్చన పూజ చేశారు. అమ్మవారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు.

త్రికాల పంచామృతాభిషేక సేవలో..

అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొని తరించారు. మార్గశిర గురువారాల్లో త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనదలిచే భక్తులు రూ.7,500, గురువారం మినహా మిగతా రోజుల్లో రూ.2,500 పూజారుసుం చెల్లించాలి. మధ్యాహ్నం జగన్నాథస్వామి ఆలయంలో 2,500 మంది భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో కె.శిరీష, సహాయ కార్యనిర్వహణాధికారి కె.తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

సకల వసతుల C/o తూర్పు



కైలాసగిరిపై శివపార్వతుల విగ్రహాలు

ఆరిలోవ: నగరంలో తూర్పు నియోజకవర్గం ప్రత్యేక స్థానం సంపాదించుకొంది. పర్యాటకం, విద్యాలయాలు, రాజకీయ రంగానికి పుట్టినిల్లుగా మారింది. వందల సంఖ్యలో అక్కడక్కడా ఉండే నివాసాలు ఇప్పుడు వేల సంఖ్యలో కొలువుదీరాయి. గతంలో ఎక్కువ మంది పేదలు తలదాచుకొనే ఈ ప్రాంతంలో ఇప్పుడు వ్యాపారవేత్తలు, విద్యావేత్తలు, కోట్లకు పడగలెత్తే రాజకీయ నాయకుల భవంతులు దర్శనమిస్తున్నాయి. జబ్బు చేస్తే పది కిలోమీటర్ల దూరంలో ఉన్న కేజీహెచ్‌కో, జిల్లా పరిషత్ వద్ద ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లే ప్రజలకు ఇప్పుడు హెల్త్‌సిటీలో కార్పొరేట్ ఆస్పత్రులు, విమ్స్ అందుబాటులో ఉన్నాయి. అంతే కాదు విశాలమైన రోడ్లు, విదేశీ పర్యాటకులను ఆకర్షించే ప్రాంతాలు, కిలోమీటర్ల మేర ఉన్న సముద్ర తీరం తూర్పు నియోజకవర్గం సొంతం.

ఒకప్పుడు ఒక వార్డు–ఇప్పుడు నియోజకవర్గం

ఒకప్పుడు జీవీఎంసీలో 23వ వార్డుగా ఉండే ప్రాంతం.. ఇప్పుడు తూర్పు నియోజకవర్గంగా ఎదిగింది. మద్దిలపాలెం, ఇసుకతోట, వెంకోజీపాలెం, ఎంవీపీ కాలనీ, ఆరిలోవ, విశాలాక్షినగర్, జాలరిపేట, అప్పూఘర్, పెదవాల్తేరు ఈ వార్డులో ఉండేవి. ఆయా కాలనీలు అన్నింటిలోను కలిపి సుమారు 15 వేల నివాసాలు, 40 వేల మంది జనాభా ఉండేవారు. ఇప్పుడు ఇదే ప్రాంతం లక్షకు పైగా నివాసాలు, సుమారు 5 లక్షలకు పైగా జనాభాతో నిండిపోయింది. దీంతో 2009 నుంచి ఒక నియోజకవర్గంగా మారిపోయింది.

ఆసియాలోనే పెద్ద కాలనీ ఎంవీపీ

నియోజకవర్గంలో ముప్వనివానిపాలెం కాలనీ(ఎంవీపీ కాలనీ) ఆసియాలోనే 12 సెక్టార్లతో అతి పెద్ద కాలనీగా పేరుపొందింది. ఇక్కడ విశాలమైన రోడ్లు, పార్కులు, భవంతులు ఉన్నాయి. ఎక్కువ మంది ధనికులు, ఉన్నత విద్యావంతులు, వ్యాపారవేత్తలు నివాసముండే ఈ ప్రాంతంలో ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థలు, బంగారం షాపులు, రియల్ ఎస్టేట్ కార్యాలయాలతో పాటు విలాసవంతమైన గాదిరాజు పేలస్, టీటీడీ కల్యాణ మండపం ఉన్నాయి.

హెల్త్ సిటీ

నియోజకవర్గంలో ఆరిలోవ ప్రాంతంలో సుమారు 200 ఎకరాలలో హెల్త్‌సిటీ ఉంది. దీనిలో అపోలో, కేర్, క్యూ–1, పినాకిల్, మెడికవర్, రెయింబో చిల్డ్రన్ హాస్పిటల్ తదితర 15 కార్పొరేట్ ఆస్పత్రులు ఉన్నాయి. మరో 7 ఆస్పత్రులు నిర్మాణ దశలో ఉన్నాయి. వీటిలో ఆధునిక వైద్యం అందుబాటులో ఉండటంతో నగరంతో పాటు ఉత్తరాంధ్ర జిల్లాలు, గోదావరి జిల్లాలు, ఒడిశా రాష్ట్రం నుంచి ఎక్కువ మంది రోగులు వస్తున్నారు. ఇక్కడ 100 ఎకరాల్లో నిర్మించిన విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(విమ్స్)లో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయి. దీంతో ఈ ప్రాంతంలో లాడ్జిలు, హోటళ్లు, టిఫిన్ సెంటర్ల సంఖ్య పెరిగి నిర్వాహకులకు కాసులు కురిపిస్తున్నాయి.

పర్యాటక కేంద్రం

నియోజకవర్గంలో విదేశీయులను సైతం ఆకర్షించే పర్యాటక కేంద్రాలున్నాయి. ఆర్‌కే బీచ్ నుంచి జోడుగుళ్లపాలెం వరకు సుమారు 10 కిలోమీటర్లు పొడవున తీరం ఉంది. దీనిలో పర్యాటకులను ఆర్‌కే బీచ్, వీఎంఆర్‌డీఏ పార్కు, తెన్నేటి పార్కు, జోడుగుళ్లపాలెం బీచ్, వైఎస్సార్ సీవ్యూ, కైలాసగిరి నగరంలోనే పేరుపొందిన పర్యాటక కేంద్రాలుగా నిలిచాయి.

కొలువైన ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు

ఇక్కడ ప్రభుత్వ, ప్రైవేట్ వ్యాపారాల కార్యాలయాలు కొలువై ఉన్నాయి. ఎంవీపీ కాలనీలో టీటీడీ కార్యాలయం, డీఆర్‌డీఏ, టాస్క్‌ఫోర్స్, విజిలెన్స్, సీబీఐ కార్యాలయం, ఆరిలోవ ప్రాంతంలో జిల్లా పశు సంవర్ధక శాఖ, జిల్లా వాణిజ్య శాఖ, విశాఖ కేంద్ర కారాగారం, సీఐడీ, ఏసీబీ, డీఈవో తదితర ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నాయి.

‘ఐరిస్’లో మెరుగైన దంత వైద్య సేవలు



డాక్టర్ వింజమూరి అనిల్‌దేవ్ దత్

ఆరిలోవ: పెదవాల్తేరు ప్రాంతం నౌకానగర్‌లోని ఐరిస్ డెంటల్ ఆస్పత్రిలో అన్ని రకాల దంత వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని ఆస్పత్రి అధినేత డాక్టర్ వింజమూరి అనిల్ దేవ్ దత్ తెలిపారు. ఇక్కడ పెద్దలు, పిల్లలకు అన్ని రకాల వయసుల వారికి వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, ఆర్టీసీ ఉద్యోగులు, సచివాలయం ఉద్యోగులకు ఈహెచ్‌ఎస్ ద్వారా ఉచితంగా వైద్యం అందిస్తున్నట్లు చెప్పారు. ఆస్పత్రికి వచ్చిన ఆదాయంలో కొంత గిరిజన గ్రామాలలో వృద్ధులు, అనాథ పిల్లలకు ఉచిత భోజనం, ప్రాథమిక వైద్యం కోసం వెచ్చిస్తున్నామన్నారు.